
ప్రజాశక్తి
ఆదివారం 16 ఏప్రిల్ 2023 | 5 | పార్వతీపురం మన్యం



కలెక్టర్‌ను కలిసిన పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్‌ను సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. గిరిజనుల అభివృద్ధికి కషి చేయాలని కలెక్టర్ పిఒకు సూచించారు.



శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి



గొలవలస గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగులు

గొలవలసలో ఏనుగులు సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మడిగూడ పంచాయతీ గొలవలస గ్రామపరిసర ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఏనుగుల గుంపు సంచారించడంతో రాత్రంతా బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడిపామని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏనుగులు తమ గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా రైతు కుటుంబాలమేనని, వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, ఎప్పుడూ పొలాల్లో ఉంటామని, అటువంటిది పొలాలకు వెళ్లాలంటే భయమేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పుడూ ఎటువైపు నుండి ఏనుగులు వచ్చి ఏం చేస్తాయోనని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవాల్సి వస్తుందని వాపోయారు. కావున అటవీ శాఖ అధికారులు స్పందించి తక్షణమే ఏనుగుల బారి నుండి తమ ప్రాణాలను, పంటలను కాపాడి జనజీవనానికి దూరంగా ఉన్న అటవీ ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.

పర్యాటకాభివృద్ధికి చర్యలు

సీతంపేట: ఏజెన్సీలో పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకొంటామని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. శనివారం టూరిజం అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఏజెన్సీలో ట్రెక్కింగ్‌కు అనుకూలమైన ప్రాంతాలు ఉన్నాయని, ట్రెక్కింగ్ ట్రాక్ అభివృద్ధికి చర్యలు చేపడతామని అన్నారు. గిరిజన మ్యూజియం, ఆడలి వ్యూ పాయింట్ పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకొంటామన్నారు. అడ్వాంచర్ పార్క్‌లో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. సున్నపుగెడ్డ ఎకో టూరిజం, బెనరాయి జలపాతానికి పర్యాటకులు సులువుగా వెళ్లేందుకు రోడ్డు వేస్తామన్నారు. సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, ఈఈ జి మురళి, ఎపిఒ రోసిరెడ్డి, డిపిఒ సతీష్, పార్క్ మేనేజర్ రాజు పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికుల పిఎఫ్ సొమ్ము చెల్లించాలి

బొబ్బిలి: శ్రీలక్ష్మీ శ్రీనివాస జ్యూట్ కార్మికుల పిఎఫ్ బకాయిలు చెల్లించాలని సిఐటియు విజయనగరం జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ జ్యూట్ కార్మికుల పిఎఫ్, గ్రాడ్యుటీ బకాయిలు చెల్లింపునకు ఎమ్మెల్యే సమక్షంలో ఒప్పందం జరిగినప్పటికీ 760మంది నూతన పర్మినెంట్, బదిలీ కార్మికులకు బకాయి చెల్లించాలని డిమార్ చేశారు. బకాయిలు వల్ల పిఎఫ్ పెన్షన్ రావడం లేదని అన్నారు.

బిజెపి పాలనలో

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

ప్రచారభేరిలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - పాచిపెంట

బిజెపి పాలనతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ఉద్యోగులకు, రైతులకు, మహిళలకు ఎటువంటి భద్రత లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలకు నిరసనగా తలపెట్టిన ప్రచారభేరిలో భాగంగా మండలంలోని కుడుమూరు, మెట్టవలసలో సిపిఎం నాయకులు సూకురు అప్పలస్వామి, కొర్ర కళ్యాణ్ ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మన రాష్ట్రానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం అంతా ఇంతా కాదన్నారు. పార్లమెంట్లు సాక్షిగా విభజన చట్టంలో ఇచ్చిన హామీలని, వీటిలో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. వీటిపై వైసిపి, టిడిపి, జనసేన బిజెపి గురించి ఒక్క మాట ఆడకపోవడం బాధాకర మన్నారు. కావున ప్రజాస్వామ్య పరిరక్షణకు అంతా కలిసి నడుం కట్టాలని, దేశ సంపదలైన రైల్వే, ఇన్సూరెన్స్, ఎయిర్ ఇండియా, బ్యాంకులు కాపాడుకోవాలని, విశాఖ ఉక్కును రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలపై మోపుతూ, దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలంతా పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: సిపిఎం ఆధ్వర్యంలో నగర పంచాయతీ ఎన్‌కె రాజపురం జంక్షన్ వద్ద పాదయాత్ర ద్వారా కరపత్రాలు పంపిణీ ప్రారంభించారు. ఈ సంధ్భంగా సిపిఎం పాలకొండ మండల కమిటీ కన్వీనర్ దావాల రమణారావు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న బిజెపి నిరంకుశ విధానాల పట్ల ప్రజలు అప్రమత్తమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గిరి, హేమ సుందరరావు, మల్లవరపు రమేష్, ఎస్.నారాయణరావు, కాద రాము, దూసి దుర్గారావు పాల్గొన్నారు.



పాచిపెంట : కుడుమూరులో ప్రచార ర్యాలీ చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు

పార్వతీపురంరూరల్ : సిపిఎం-సిపిఐ ప్రచారభేరిలో భాగంగా మండలంలోని బందలుప్పి, పెద్ద బొండపల్లి, పుట్టూరు తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్ర మంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లా డారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకన్న, రాము, లక్ష్మణ పిఎల్ నాయుడు, నాగేషు పాల్గొన్నారు.

సీతంపేట : మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో శనివారం ప్రచార బేరి వాల్ పోస్టర్‌ను వామపక్షాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపదాం దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ఏప్రిల్ 14 నుండి 30 వరకు ప్రచార భేరి జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పాలకు సాంబయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ, కార్పొరేట్ దోపిడీకి చెల్లు చీటీ చేయాలన్నారు. సామాన్య ప్రజల రక్షణ ప్రధాన కర్తవ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్ధన్, జగదీష్, బి. సాయి తదితరులు ఉన్నారు.

కార్పొరేట్ల తొత్తు ప్రధాని మోడీ

సాలూరు: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను, మతోన్మాద విధానాలను ఎండగట్టాలనే లక్ష్యంతో వామపక్షాల ఆధ్వర్యాన ప్రచారభేరి ప్రారంభించి నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు చెప్పారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోడీ బాధ్యతలు చేపట్టిన తర్వాత అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ల ఆస్తులు వేల రెట్లు పెరిగాయన్నారు. ప్రజలపై పెనుభారం మోపుతూ ఆర్థిక ఇబ్బందుల్లో పడేశారని చెప్పారు. తొమ్మిదేళ్లలో రాష్ట్రాన్ని కోలుకోలేని దెబ్బ తీశారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరణ చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. దీనిలో భాగంగానే విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై ముందుకు వెళ్తుంటే వామపక్షాలు, ప్రజాసంఘాలు తీవ్రంగా ప్రతిఘటించాయని చెప్పారు. కార్మికుల ఐక్య పోరాటంతో బిజెపి ప్రభుత్వం ప్రయివేటీకరణపై వెనక్కి తగ్గిందని చెప్పారు. ఈ విధానాలను ఎండగడుతూ నిర్వహిస్తున్న ప్రచారభేరిని విజయవంతం చేయాలని వేణు కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్ని నాయుడు, ఎం.శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు, మండల నాయకులు వంతల సుందరరావు, జానకిరావు పాల్గొన్నారు.



పాలకొండలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు



రాజన్నదొరకు వినతిని అందజేస్తున్న విఆర్ఎలు

సమస్యలు పరిష్కరించాలని విఆర్ఎల వినతి

ప్రజాశక్తి - సాలూరు

జిల్లాలోని గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారు డిప్యూటీ సిఎం రాజన్నదొరకు శనివారం వినతిపత్రం అందజేశారు. రాజన్నదొర నివాసంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన విఆర్ఎలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఎన్వై నాయుడు మాట్లాడుతూ విఆర్ఎలకు రూ.26వేలు కనీస వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. నామినీ విఆర్ఎలను విఆర్ఎలుగా పరిగణించాలని కోరారు. ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఇంటర్ చదువుకున్న విఆర్ఎలకు విఆర్ఒలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు, కోశాధికారి పాపారావు పాల్గొన్నారు.



సరుకుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఆడిటర్ ఇందిరా లావణ్య

సరుకుల నిల్వ సక్రమంగా ఉండాలి

గుమ్మలక్ష్మీపురం : గిరిజన సహకార మార్కెటింగ్ సొసైటీ మరియు ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ల ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న సరుకుల నిల్వల కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని అసిస్టెంట్ రిజిస్టర్ ఆడిటర్ పి.ఇందిరా లావణ్య తెలిపారు. శనివారం ఆమె మండల కేంద్రంలో ఉన్న జిసిఎంఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న పిడిఎస్ సరుకుల గోదాంలను, డిఆర్ఎస్ గోదాములను, పెట్రోల్ బంకు, ఇండేన్ గ్యాస్ గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సంబంధిత సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ప్రభుత్వం నుంచి ప్రతినెలా వస్తున్న ప్రతి సరుకును గోదాముల్లో సక్రమంగా నిల్వ చేయాలని సూచించారు. ఐజిసి, జిసిఎంఎస్ ల ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంకును కూడా పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఈమె వెంట డిఆర్ఎస్ గోదాం ఇన్చార్జ్ ఎం.సాంబశివరావు, జిసిసి సిబ్బంది తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన వారోత్సవాలు


ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అగ్ని ప్రమాదాలపై అవగాహనా, భద్రత వారోత్సవాలను శుక్రవారం స్థానిక ఆర్‌టిసి ప్రాంగణంలో అగ్నిమాపక శాఖ అధికారులు నిర్వహించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 14నుంచి 20 వరకు అవగాహనా కార్యక్రమాలను చేపడుతున్నామని అగ్నిమాపక అధికారి యు.సుధాకరరావు అన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఆయిల్ ట్యాంక్‌లు పేలినప్పుడు, ఎలక్ట్రికల్ పరికరాల వల్ల ప్రమాదం ఏర్పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్‌టిసి సిబ్బందికి, ప్రజలకు అవగాహనను శనివారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో నిర్వహించారు. గ్యాస్ సిలిండర్ పేలినప్పుడు, అధిక ఉష్ణోగ్రతల వల్ల పొలాల్లో గడ్డివాములు కాలిపోవడం సంభవిస్తుందని, అటువంటి అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు గాబరా పడకుండా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు ఆలోచించాలని అన్నారు. చిన్న చిట్కాలతో పెద్ద ప్రమాదాలు సులభంగా నియంత్రించవచ్చని చెప్పారు. వివిధ ప్రమాదాల నియంత్రణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది టి.ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, పట్టణ మార్కెట్ కూడలిలో అగ్నిమాపక అధికారి జామ సర్వేశ్వరరావు, సిబ్బంది స్థానికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. అలాగే అగ్నిమాపక వాహనం సహాయంతో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎలా అగ్ని ప్రమాదాన్ని నివారిస్తారన్నది ప్రదర్శించారు.



పార్వతీపురంలో అగ్నిప్రమాదాలను అదుపు చేసే విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది



పాలకొండ : ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున అగ్నిమాపక సిబ్బంది

సాలూరు: అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా రెండు రోజు కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ అధికారి పి.పైడిరాజు ఆధ్వర్యాన సిబ్బంది కరపత్రాల పంపిణీ చేశారు. ఫైర్ స్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సిబ్బంది ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆర్టీసి కాంప్లెక్స్‌లో ప్రయాణికులు, ఆర్టీసీ కార్మికులు గ్యారేజ్ కార్మికుల కు అందజేశారు. పెట్రోల్, డీజిల్ వంటి మండే పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తోటపల్లిపై దొందూ దొందే...

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి


విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల రైతాంగం ఎంతో ఆశపెట్టుకున్న తోటపల్లిపై అధికార, ప్రతిపక్ష పార్టీలు దొందూ దొందే అన్న చందంగా వ్యవహరిస్తున్నాయి. ఉన్నట్టుండి ఎన్నికల ముందు, రాజకీయ అంశలు వేడెక్కినప్పుడు ఈ రెండు పార్టీలకు తోటపల్లి గుర్తుకు వస్తుంది. తామే నిర్మించామని ఒకరు, మేం లేకపోతే ఆ ప్రాజెక్టే లేదంటూ మరొకరు పరస్పర విమర్శలు చేసుకోవడం పరిపాటిగా మారుతోంది. తాజాగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్‌గజపతిరాజు, కిమిడి కళా వెంకటరావు - వైసిపి జిల్లా నేత మజ్జి శ్రీనివాసరావు మధ్య ఇదే రకమైన మాటల యుద్ధం మొదైలంది. భోగాపురం ఎయిర్‌పోర్టుపై విమర్శలు మొదలెట్టిన టిడిపి నాయకులు పనిలో పనిగా ప్రభుత్వం తోటపల్లి సాగునీటి ప్రాజెక్టును విస్మరించినట్టుగా విమర్శలు చేశారు. ఈ ఏడుపేదో చట్ట సభల్లోనో ప్రజాక్షేత్రంలో చేయొచ్చుకదా. అలా అయితే కనీసం ప్రభుత్వానికి చలనం రాకపోయినా ప్రజలైన పరిస్థితులు అర్థం చేసుకుంటారు కదా? అన్నది కాస్త రాజకీయ పరిజ్ఞానం ఉన్నవారి వాదన. 64వేల ఎకరాల సాగునీటిని స్థిరీకరిస్తూనే 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2004లో తలపెట్టిన తోటపల్లి ప్రాజెక్టు ఇప్పటి వరకు 80శాతం పనులు పూర్తయినమాట వాస్తవమే. కానీ, ఇంకా పిల్లకాలువలు, స్ట్రక్చర్లు, మదుములు వంటి పనులు మిగిలేవున్నాయి. దీంతో, 58,757ఎకరాలకు సాగునీరు అందించలేని పరిస్థితి దాపురించింది. నెల్లిమర్ల, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు పూర్తిగా నీరు అందడం లేదు. మిగిలిన ఆయుకట్టుకు కూడా అరకొరసాగానే సాగునీరు అందుతోంది. 2017లో పూసపాటిరేగ మండలానికి నీరు అందినప్పటికీ ఆ తరువాత నుంచి రావడం లేదు. దీంతో, సుమారు 20ఏళ్లగా రైతాంగం తోటపల్లి కోసం ఎదురు చూస్తునే ఉంది. ఇందులోనూ పెండింగ్ పనులకు రూ.73.13 కోట్లే. భూమి కొనుగోలుకు రూ.3.75కోట్లు, ఆర్అండ్ ఆర్‌కు రూ.3.96 కోట్లు విభజించారు. ఇప్పటికే నిధులు సరిపోక కాంట్రాక్టర్ పనులు నిలిపివేసిన పరిస్థితుల్లో తాజా కేటాయింపులు మరింత విస్మయానికి గురిచేశాయి. వైసిపి అధికారంలోకి వచ్చాక తోటపల్లికి కేటాయించిన నిధులను ఒక్కసారి పరిశీలిస్తే 2019-20 రూ.156 కోట్లు కేటాయించగా, రూ.13.64కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. 2020-21లో రూ.225.57కోట్లకుగాను రూ.37.27కోట్లే ఇచ్చారు. 2021-22లో రూ.199.70కోట్ల బడ్జెట్ కేటాయించగా ఆచరణలో ఖర్చుచేసింది రూ.1.35కోట్లే. 2022-23లో రూ.126.61 కోట్లకు గాను రూ.4.26కోట్లు ఇచ్చారు. 2023-24లో మిగులు పనులకు రూ.294.90 కోట్లు, సిఎడి డబ్ల్యుఎం పనులకు రూ.107.69 కోట్లు, భూసేకరణకు 46.38కోట్లు, అర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి రూ.107.06 కోట్లు చొప్పున మొత్తం రూ.556.03 కోట్లు కేటాయించాలని కోరుతూ ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపారు. బడ్జెట్‌లో కేవలం రూ.80.84కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ ఐదేళ్లపాటు టిడిపి తోటపల్లి కోసం మాట్లాడిన దాఖలాలు లేవు. అంతకు ముందూ అవసరానికి తగ్గట్టు నిధులు కేటాయించిన సందర్భాలు అంతకన్నా లేవు. ఇటువంటి పరిస్థితుల్లో అధికార ప్రతిపక్ష నాయకులు వాస్తవాలను కప్పిపుచ్చేందుకు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



వ్యాధుల సమాచారం అందించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

నోటిఫైడ్ వ్యాధుల సమాచారం అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. జిల్లాలో గల ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హెూమ్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాల యాజమాన్యాలతో శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిఫైడ్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, కోవిడ్, క్షయ, లెప్రసీ, మిజిల్స్, పోలియో మొదలగు వ్యాధులు లాబ్ పరీక్షల్లో బయటపడితే తక్షణం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయానికి తెలియజేయాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్ మెంట్ పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్ మెంట్‌పై రెయిన్ బో సంస్థతో ఒప్పందం కుదిరినప్పటికి వ్యర్థాలు డిస్పోజ్ చేయడంలో నిబంధనలు సక్రమంగా పాటించడం లేదన్నారు. నిబంధనలు పక్కాగా అమలు చేసి డిస్పోజ్ చేయాలని స్పష్టం చేశారు. కలర్ కోడెడ్ బిన్స్ ఉపయోగించుటలో సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వైద్య సంస్థల్లో అగ్ని మాపక యంత్రాలను తరచూ తనిఖీ చేయాలన్నారు. అత్యవసర సమయంలో ఉపయోగించే విధానంపై సిబ్బందికి సరైన శిక్షణను కల్పించాలని ఆయన సూచించారు. ఆసుపత్రుల్లో అందించే సేవలు, డయగ్నోస్టిక్ సేవల ఫీజు వివరాలు ప్రదర్శించాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలు పక్కాగా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంటువ్యాధులు, అంటువ్యాధులు కాని వ్యాధులపై అవగాహన కల్పించాలని, అవసరమైన పోస్టర్లు, ఫ్లెక్సీలు, కరపత్రాలు ప్రదర్శించాలని ఆయన స్పష్టం చేశారు. పోస్టర్లు, కరపత్రాలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన అన్నారు. జూమ్ కాన్ఫరెన్స్ లో ఎసిడిమియాలజిస్ట్ డా.ఎం.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

వైసిపి పట్ల ప్రజల్లో విశ్వాసం

పార్టీ జిల్లా అధ్యక్షులు పరీక్షిత్ రాజు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వైసిపి ప్రభుత్వం పట్ల ప్రజల్లో రోజురోజుకు విశ్వాసం పెరుగుతుందని, ఇందుకు నిదర్శనం ఇటీవల గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి వస్తున్న స్పందన అని వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షత్‌రాజు అన్నారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ముందుగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ తమ పాలనపై మెగా పీపుల్ సర్వే ద్వారా కోటీ 50 లక్షల కుటుంబాలను నేరుగా కలిసి ఐదు కోట్ల మంది ప్రజల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేయిస్తున్న మొట్ట మొదటి ముఖ్యమంత్రి అని కొనియాడారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా కన్వీనర్లు, గహసారథులు, వాలంటీర్లు, కార్యకర్తలంతా కలిసి ప్రతి గడపకు వెళ్లి తమ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలుని వివరించడంతో పాటు వారి కష్టసుఖాలను అడిగి ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాన్ని సేకరిస్తున్నామని తెలిపారు. అనంతరం పరీక్షిత్ రాజు మాట్లాడుతూ పార్వతీపురంలో మల్టీ స్పెషాలిటీతో పాటు మెడికల్ కాలేజీ, కురుపాంలో ట్రైబల్ ఇంజనీరింగ్ కళాశాల మంజూరు కావడమే కాకుండా నిర్మాణం పనులు చకచగా సాగుతున్నాయని అన్నారు. అలాగే పాలకొండ నియోజకవర్గంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, సాలూరు నియోజకవర్గంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటవుతున్నట్టు తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని కుతంత్రాలు చేసినా 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రానున్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో మూడు మండలాల పార్టీ అధ్యక్షులు, పార్టీ పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు, నియోజకవర్గ పరిధిలోని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎఎంసి చైర్మన్, వైస్‌చైర్మన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ ఆలయ ఇఒగా మురళీకృష్ణ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక కోట దుర్గమ్మ ఆలయ ఇఒగా బివిఎస్ఎస్ మురళీకృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఇఒ రాధాకృష్ణ బదిలీపై శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి ఆలయ ఇఒగా వెళ్లడంతో ఆయన స్థానంలో ఈయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఆయనకు ఆలయ సిబ్బంది పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఖరీఫ్‌కు ముందస్తు ప్రణాళికలు

సీతానగరం : రాబోయే ఖరీఫ్‌కు రాయితీతో పంపిణీ చేసే పచ్చిరొట్ట, వరి విత్తనాల కోసం ముందస్తు ప్రణాళికలో భాగంగా రైతు భరోసా కేంద్రాల వారీగా గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా నివేదికను తీసుకుంటున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ అన్నారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో శనివారం సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన విత్తనాల రకాలను ముందస్తుగా తెలియజేయాలని సూచించారు. అలాగే ఈ సంవత్సరం భూసార పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రైతు ఈ విషయాన్ని గమనించి గ్రామ వ్యవసాయ సహాయకులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపిపి బి.రమణమ్మ, జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ, రైతులు, విఎఎలు పాల్గొన్నారు.

లుంబూరులో గ్రామసభ

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు గ్రామ పంచాయితీలో శనివారం సర్పంచ్ తిర్లింగి ఉపేంద్ర కుమార్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. మండల హార్టికల్చరల్ అధికారి అమరేశ్వరి హాజరై పంచాయతీ పరిధిలో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతీ ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వామ్యంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పడాల రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ రౌతు నాగభూషణరావు, నెల్లి నాగభూషణరావు, సచివాలయ ఉద్యోగులు, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

ప్రభుత్వ కళాశాలలో చేరండి

పాలకొండ: పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) అధ్యాపకులు శనివారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన విద్య అందిస్తామని, సకల సౌకర్యాలతో కూడిన అధునాతన తరగతి గదులు, పూర్తిస్థాయి వసతులతో ప్రయోగశాలలున్నాయన్నారు. వేలాది పుస్తకాలతో లైబ్రరీ, సుదీర్ఘ అనుభవం గల అధ్యాపకుల పర్యవేక్షణ, క్రమశిక్షణతో కూడిన ఉజ్వల భవిష్యత్తుకు తమ కళాశాలలో చేరాలని కోరారు. మండలంలోని తంపటపల్లి, తుమరాడ, అల్లిన వడమ తదితర గ్రామాల్లో పదవ తరగతి పరీక్షలు రాసి, ఇంటర్మీడియట్‌లో చేరబోయే విద్యార్థిని విద్యార్థులను, వారి తల్లి తండ్రులను కలిసి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవశ్యకతను ప్రత్యేకతలను స్వయంగా తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వరరావు, వెలమల అప్పారావు, శ్రీనివాసరావు, గిరిబాబు, శివానంద్ పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన

పాలకొండ రూరల్: మండలంలోని ఎం. సింగుపురం, జంపర కోట సచివాలయాలను ఎంపిడిఒ డొంక త్రినాథులు శనివారం సందర్శించారు. రికార్డులతో పాటు సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం జంపరకోట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. వేతన దారులు సమయపాలన పాటించి పనులకు హాజరు కావాలన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

వీరఘట్టం: మండలంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతోపాటు గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో ఈ నెల మూడో తేదీ నుండి జరుగుతున్న పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిసాయి. మండలంలోని మొత్తం 735 మంది పరీక్షలు రాసినట్లు ఎంఇఒ కృష్ణమూర్తి తెలిపారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షలు కూడా..

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్ పరీక్షలు శనివారంతో ముగిసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ డి నాగమణి తెలిపారు. శనివారం నిర్వహించిన పరీక్షకు 212 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉన్నప్పటికీ 13 మంది హాజరు కాలేదని ఆమె తెలిపారు.

త్వరితగతిన పనులు పూర్తి

సీతంపేట : స్థానిక ఏరియా ఆస్పత్రి అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని, తక్షణమే అధికారులు స్పందించి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకొని గిరిజనులకు వైద్యసేవలందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు కోరారు. ఆస్పత్రి పనులు పూర్తి కాకపోవడంతో సక్రమంగా వైద్యమందక గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే వైద్యులు కూడా సేవలందించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆస్పత్రి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

రోడ్లపై పశువులు తిరిగితే జరిమానా

పార్వతీపురం టౌన్ : పశువులు, పందులు, కుక్కలు పట్టణ ప్రధాన రహదారిలోనూ, కూడళ్లలో విచ్చలవిడిగా సంచరిస్తే పెంపకందారులకు రూ.2వేలు జరిమానా విధించనున్నట్లు కమిషనర్ జె.రామప్పలనాయుడు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పశువులు, పందులు, కుక్కలు రోడ్లపై విచ్చలవిడిగా తిరగడంతో పాదాచారులు, ద్విచక్ర వాహన చోదకులకు పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతున్నామని పలువురు ఫిర్యాదు చేశారు. పశువులను, పందులను, కుక్కలను రోడ్లపై వదిలి వేస్తే వాటిని స్వాధీనం చేసుకుని సంబంధిత యజమానులకు ఒక్కొక్క పశువుకు రూ.2వేలు జరిమానా విధిస్తామన్నారు. అలాగే రోడ్లపై తిరిగే పందులను చంపించడం, పట్టి వేయడం జరుగుతుందని, పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలను పశు వైద్యాధికారి చేయించి, ధ్రువపత్రాన్ని పొందాలని లేనిచో వాటిని పట్టిస్తామని తెలిపారు.

ఎస్‌పిని కలిసిన జనసేన నాయకులు

పార్వతీపురం రూరల్ : జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విక్రాంత్‌పాటిల్‌ను శనివారం నియోజకవర్గ జనసేన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు పార్వతీపురంలో జరుగుతున్న నాటుసారా, గంజాయి, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నివారణకు చర్యలు చేపట్టాలని, దౌర్జన్యాలు, దొంగతనాలు, కబ్జాలను కట్టడి చేయాలని కోరారు. ఎస్‌పిని కలిసిన వారిలో దాలి నాయుడు, బంటు శిరీష్, అన్నా బత్తుల దుర్గాప్రసాద్, రౌతు బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణసంఘం కార్యవర్గం ఎన్నిక

కొమరాడ : మండలంలో నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక మన్యం అధ్యక్షులు పట్నాన రవిశంకర్ ఆధ్వర్యంలో అర్తంలో శనివారం జరిగింది. సంఘం మండల అధ్యక్షులుగా భోగి త్రినాధరావు, ప్రధాన కార్యదర్శిగా కటారపు హేమసుందర్, ఉపాధ్యక్షులుగా పొట్నూరు శంకరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నుకోబడిన సభ్యులకు సంఘం ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నుకోబడిన సభ్యులు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి, సంఘం సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తామని వారు తెలిపారు. ప్రభుత్వ అందజేస్తున్న పథకాలను నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు.

ఏగోటివలసలో ఫ్యామిలీ డాక్టర్

సీతానగరం : మండలంలోని ఏగోటివలసలో పెద్ద అంకలాం పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.రాధాకాంత్ ఆధ్వర్యంలో శనివార ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జ్వరం, బిపి, షుగర్ రోగులను పరీక్షించి ఉచిత మందులను పంపిణీ చేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రోగులకు వివరించారు. ఎండ తీవ్రతను బట్టి ప్రయాణించేటప్పుడు అలాగే గర్భిణీలు బాలింతలు చాలా జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒ జి.సూర్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఎఎన్ఎం బి.రమాదేవి, ఎంఎల్‌హెచ్‌ఒ కె.కీర్తి, 104 సిబ్బంది రోగులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకే క్రాష్‌ప్రోగ్రాం

ప్రజాశక్తి - కురుపాం

ప్రజల దాహార్తిని తీర్చడానికే క్రాష్‌ప్రోగ్రాం వేసవిలో నిర్వహిస్తున్నట్లు జెడ్‌పిటిసి సభ్యులు గొర్లి సుజాత అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ వివి శివరామప్ప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రాస్ ప్రోగ్రాం వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 15 నుంచి మే 24 వరకు మండలంలో గల 23 పంచాయితీలను క్రాస్ ప్రోగ్రాం వాహనం తిరుగుతూ మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లను బాగు చేస్తుందని తెలిపారు. వీటికి సర్పంచులే కీలక బాధ్యత తీసుకొని వారి పరిధిలో గల అన్ని గ్రామాల్లో బోర్లను బాగు చేయించుకొని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కె.నాగేశ్వరరావు, ఎఇ ఆర్.వేణుగోపాలరావు, జిల్లా కోప్షన్ సభ్యులు షేక్ నిషార్, స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఎంపీటీసీలు వి.బంగారనాయుడు, టీవీఎస్ స్వామిజులు, సంతోషిని, ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది, బోర్ మెకానికులు పాల్గొన్నారు.



కురుపాం: వాహనాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి గొర్లి సూజాత

గుమ్మలక్ష్మీపురం: గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో క్రాస్ ప్రోగ్రాం ప్రారంభమైంది. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురంలోని కొండవీధిలో బోరు మరమ్మతు చేయించే పనులు ప్రారంభించారు. సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు ఆధ్వర్యంలో పాడైన మంచినీటి బోర్ల మరమ్మతు పనులు ప్రారంభించారు. మండల కేంద్రంలో కొన్ని వీధుల్లో మరికొన్ని బోర్లను ఈ క్రాస్ ప్రోగ్రాం సమయంలో రిపేరు చేస్తామని సంబంధిత గ్రామీణ నీటి సరఫరా విభాగం శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.సాల్మన్ రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కిషోర్, గ్రీన్ అంబాసిడర్లు, బోర్ మెకానికులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణ వద్ద క్రాస్ ప్రోగ్రాంను ఎంపిపి బి.రమణమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు బాబ్జీ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి నివారించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బోర్లు మరమ్మతుకు గురైతే వెంటనే వాటిని బాగు చేసి నీరందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, బోర్ మెకానిక్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు

సిఎం ఆరోపణలు నిరాధారం : టిడిపి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

అధికారంలోకి రాకమునుపు టిడిపిపై ఆరోపించినవన్నీ ఒక్కొక్కటి అబద్ధాలని తేలిపోవడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన సొంత పత్రికలో ప్రతిపక్షాల మాటలను వక్రీకరిస్తూ దిక్కుమాలిన రాతలు రాయిస్తున్నారని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. మండలంలోని కృష్ణపల్లిలో మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జి బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో జరిగిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ పేరుపై నారా లోకేష్ వ్యాఖ్యలను వక్రీకరిస్తూ తప్పుడు వార్తలు రాసి ప్రచారం చేస్తున్న జగన్, గతంలో చంద్రబాబునాయుడిపై, అనేక తప్పుడు వార్తలు ప్రచారం చేసి దొరికిపోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. బాబాయిని చంపి నారా వారి రక్తచరిత్ర అంటూ చంద్రబాబు నాయుడికి అంటగట్టారన్నారు. అమరావతిలో ఇన్ సైడర్ ట్రేడింగ్, పోలవరం, పట్టిసీమల్లో అవినీతి అని తప్పుడు ప్రచారం చేశారని అన్నారు. అవన్నీ ఇప్పుడు దర్యాప్తు సంస్థలు తప్పుడు ఆరోపణలని తేల్చడంతో ప్రజల ముందు దోషిగా నిలబడిన ముఖ్యమంత్రి దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు గొట్టాపు వెంకట నాయుడు,ఉదయభాను బోను, చంద్రమౌళి, జి రామ్మూర్తి , ప్రదీప్, కౌన్సిలర్లు టి వెంకట్రావు, బడే గౌర్నాయుడు, కోల మధు, పాలకొండ రాజశేఖర్, సిరిపురం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణపల్లిలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులుత

కురుపాం : మండలంలోని వబ్బంగి పంచాయతీలో గల భీంపురం, గానలి గిరిజన గ్రామాల్లో శనివారం టిడిపి యూనిట్ ఇంచార్జ్ ప్రదీప్, జనరల్ సెక్రెటరీ శంకర్రావు ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి హాజరయ్యారు. ముందుగా గ్రామంలో వైసిపి చేస్తున్న అరాచకాలపై నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజేష్, ఆరుద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతోనే మళ్లీ అధికారం

ప్రజాశక్తి - సాలూరు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తుందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని 28, 20, 21, 22వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్తు, జగనన్న మా నమ్మకం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలులో వైసిపి ప్రభుత్వం, టిడిపి ప్రభుత్వాల మధ్య తేడాను వివరించారు. ఇంటి వాకిళ్లలో స్టిక్కర్లను, సెల్‌ఫోన్ల పైన స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా పథకాలను అందజేస్తున్నారని చెప్పారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మళ్లీ గెలుపించుకోకపోతే పేదలే నష్టపోతారని రాజన్నదొర చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు గిరిరఘు, గొర్లి వెంకటరమణ, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ, 21వ వార్డు ఇంఛార్జి పిట్టా వాసుదేవరావు, వైసిపి నాయకులు బద్రి బాబు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం రాజన్నదొర



ఇంటికి స్టిక్కర్‌ను అతికిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని 17వ వార్డులో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఇంటి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి వైసిపిని ఆదరించాలని కోరారు. ఈయనతో పాటు కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, కొంచాడ అరుణ్, పల్లా భాను, తూముల లక్ష్మణరావు పాల్గొన్నారు.

మట్టి సేకరణపై అవగాహన

ప్రజాశక్తి - భామిని

మట్టి నమూనాల సేకరణపై గ్రామ వ్యవసాయ సహాయకులకు స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఎఒ కె సింహాచలం శనివారం శిక్షణ ఇచ్చారు. మట్టి నమూనా సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సేకరించే వివరాలను క్షుణ్ణంగా తెలియజేసారు. తదుపరి సోమరాజు గోపాలరావు పొలంలో ప్రయోగాత్మకంగా మట్టి నమూనాను సేకరించారు. కొన్ని సంవత్సరాలుగా రైతులు అధిక దిగుబడులును ఆశించి పొలంలో విచ్చలవిడిగా రసాయన ఎరువులను వాటి మోతాదుకు మించి వాడటం వల్ల భూములు క్రమంగా నిశ్శారావంతమై తక్కువ దిగుబడులు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తమ భూముల యొక్క మట్టిని పరిశీలింపజేసుకోవాలన్నారు. వ్యవసాయ క్షేత్రాలలో మట్టి నమూనా సేకరణ సక్రమంగా జరిపి, పరిశీలన చేసి, మట్టిలో పోషక విలువలు స్థాయి, ఆ వ్యవసాయ క్షేత్రం ఏ పంటలకు అనువుగా దిగుబడి ఉంటుందో తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోట సింహాచలం, వ్యవసాయ సలహా మండలి సభ్యుల మజ్జి శ్రీనివాసరావు, ఈదు మురళీధర్ రావు, అరిక త్రినాథరావు, గౌడు ధీనభందు, గురుగుబిల్లి లక్ష్మీపతినాయుడు, మండల గ్రామ వ్యవసాయ సహాయకులు అందరూ పాల్గొన్నారు.



పార్వతీపురం రూరల్: రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పార్వతీపురం రూరల్ : తమండలంలోని తాళ్ల బురిడిలో మట్టి నమూనా సేకరణ, పరిశీలనపై రైతు భరోసా కేంద్రంలో సిబ్బందికి డిటిసి ఎడిఎ శారద, మండల వ్యవసాయ అధికారి రేఖ పర్యవేక్షణలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా విఎఎ, విహెచ్ఎలకు మట్టి నమూనా సేకరణ విధానం, మట్టి నమూనా పరిశీలన పత్రం గురించి వివరించారు. రైతులకు సోయిల్ హెల్త్ కార్డు ఆధారంగా ఎరువులు వేయాలని సూచించారు. నీటి ఆధారిత భూములైతే 6.25 ఎకరాలకు ఒక 500 గ్రాముల మట్టి నమూనా తీయాలని, వర్షాధార ప్రాంతానికి 25 ఎకరాలకు ఒక మట్టి నమూనా తీయాలని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రీనీ ఎస్.బాలకృష్ణ, విఎఎలు, విహెచ్ఎలు పాల్గొన్నారు.

పాచిపెంట : నేల స్థితిగతులు తెలుసుకోడానికి మట్టి నమూనాలను సేకరిస్తున్నట్టు సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్‌రావు అన్నారు. మండలంలోని కొటికపెంట రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు మండల స్థాయిలో ఏర్పాటు చేసిన మట్టి నమూనాల సేకరణ, విశ్లేషణపై శిక్షణ కార్యక్రమంలో భూసార పరీక్షల ఆవశ్యకత వివరించారు. మట్టిని అడుగుదాం మట్టి మాట విందాం... కావాల్సిన ఎరువులను మాత్రమే వాడుదాం అని, ఏ నేలపై ఎలాంటి పంటలు పండించాలి, ఎలాంటి రకాలు వేయాలి, ఎలాంటి పంటల సరళిని అనుసరించాలని, ఏఏ ఎరువులను వేయాలని, అన్న అంశాలపై భూసార పరీక్షలు చేయించాలని, దీనికోసం మట్టిని జాగ్రత్తగా సేకరించాలని తెలిపారు. అనంతరం భూసార పరీక్షల ఉపయోగాలను వివరించారు. ఎన్నో ఉపయోగాలున్న భూసార పరీక్షలను సక్రమంగా చేసి భూసార కార్డు రైతులకు అందించడంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది ప్రముఖ పాత్ర వహించాలని కోరారు. అనంతరం మట్టి నమూనాల ఆవశ్యకతను తెలుపుతూ కొత్తవలసలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు, విస్తరణాధికారి హైమావతి, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.



బామిని: రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఘనంగా స్నాతకోత్సవం

పాలకొండ రూరల్: స్థానిక నీలమ్మ కాలనీలో రవీంద్ర భారతి పాఠశాలలో చిన్నారుల స్నాతకోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ పిల్లలు వివిధ రకాల వ్యాసధారణలతో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ రౌతు భారతి (గైనకాలజిస్ట్) మాట్లాడుతూ ఇటువంటి కిడ్స్ కాన్వకేషన్ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వల్ల పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందని తద్వారా పిల్లల భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకోగలుగుతారని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ నేతింటి శ్యామసుందరరావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పిల్లలు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడటం వాళ్ళ ఉపాధ్యాయుల కష్టానికి ప్రతిఫలం అని కొనియాడారు. పాఠశాల డీన్ సిమ్మ నాగరాజు మాట్లాడుతూ రవీంద్ర భారతి స్కూల్ ఎల్లప్పుడూ పిల్లల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనందరం విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికేట్లతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర భారతి డివిజనల్ ఇంచార్జ్ చుక్క శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర జోనల్ ఇంచార్జ్ వెంకటేష్, జిఎం రమ్య, డిఐ. సిహెచ్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆడలి వ్యూ పాయింట్ సందర్శన

సీతంపేట: మండలంలోని ఆడలి వ్యూ పాయింట్‌ను ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి శనివారం సాయంత్రం సందర్శించారు. అక్కడ పనులు గురించి తెలుసుకున్నారు. అనంతరం సీతంపేట పిఎంఆర్‌సి వద్ద ఉన్న గిరిజన మ్యూజియం ం సందర్శించారు అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆమెతో పాటు జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, డిపిఒ సతీష్ తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న పిఒ కల్పనాకుమారి

నాణ్యత పాటించాలి

పార్వతీపురం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యా కానుకలలో నాణ్యత పాటించాలని పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ కార్యదర్శి అమరాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంఘ నాయకులతో కలిసి వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యా కానుకలలో అందించే వస్తువులతో పాటు ఈ ఏడాది ఆరవ తరగతి నుండి పదవ తరగతి పిల్లలకు జామెంట్రీ బాక్స్ కూడా అందించాలని, వస్తువులు నాణ్యత పెంచాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాగాన విజయ్, కుమార్, భోగి రవికుమార్, తోడు బండి తాతబాబు, గుల్ల రామినాయుడు తదితరులు ఉన్నారు.

జనసేన మండల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బత్తిలి గ్రామానికి చెందిన రుంకు కిరణ్ కుమార్‌ను జనసేన పార్టీ మండల అధ్యక్షులుగా నియమించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని 21 మండలాల తొలి విడత జనసేన అధ్యక్షులు నియామకాల్లో భాగంగా ఇతన్ని నియమించారు. మండలంలో జనసేన పార్టీ బలోపేతానికి క్షేత్ర స్థాయిలో మరింత కృషి చేస్తానని ఈ సందర్భంగా రుంకు కిరణ్ కుమార్ తెలిపారు. తనను మండల జనసేన పార్టీ అధ్యక్షులుగా నియమించినందుకు పార్టీ పెద్దలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



కిరణ్‌కుమార్

మండల అధ్యక్షులుగా విశ్వనాధం

సీతంపేట: జనసేన పార్టీ మండల అధ్యక్షుడిగా మండంగి విశ్వనాధంను నియమిస్తూ జనసేన పార్టీ అధికారిక ప్రకటన చేసింది. మండల అధ్యక్షుడు నియామకం పట్ల జనసేన కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. విశ్వనాధం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షులుగా నియమించిందని పార్టీ నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.



విశ్వనాధం

రక్తహీనత నివారణకు చర్యలు : డిఐఒ

ప్రజాశక్తి - మక్కువ

గర్భిణీలు, చిన్నారులు, బాలింతల్లో రక్తహీనత నివారణ దిశగా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని వెంకటబైరిపురం, కొయ్యానపేట గ్రామాల్లో శనివారం ఆయన సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, సిరప్‌ల లభ్యత వివరాలను పరిశీలించి వాటి వినియోగంపై సిబ్బందిని ఆరా తీశారు. గర్భిణీలకు భోజనం తర్వాత క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వేయించాలని, ఆరు నెలల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు వారానికి రెండు సార్లు ఐరన్ సిరప్ తప్పకుండా వేయించాలని సిబ్బందికి సూచించారు. అలాగే గర్భిణీలకు, పిల్లలకు కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారం పూర్తి స్థాయిలో వినియోగించడం పై దృష్టి పెట్టాలని అంగన్వాడీ, వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. ఇవన్నీ రక్తహీనత నివారణకు దోహదపడతాయని తెలిపారు. అలాగే వ్యాధి నిరోధక టీకాలు షెడ్యూలు ప్రకారం వేయాలన్నారు. డ్రాపౌట్, లెఫ్ట్ ఔట్ పిల్లలను గుర్తించి టీకా పడేలా దృష్టి సారించాలన్నారు. పిల్లల, గర్భిణీల ఆరోగ్య పర్యవేక్షణ రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు ఆన్లైన్ నమోదు చేయాలన్నారు. అనంతరం ఆయన పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. సామ్, మామ్‌గా గుర్తించిన పిల్లలను జిల్లా ఆసుపత్రిలో ఎన్ఆర్‌సి కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలపై అవగాహన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించి ఒపి నిర్వహణ రికార్డులు పరిశీలించారు. వివిధ అనారోగ్య సమస్యలతో అక్కడకు వచ్చిన వారితో మాట్లాడి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మక్కువ వైద్యాధికారి డి.కిరణ్ కుమార్ రెడ్డి, సిహెచ్ఒ పి.శకుంతలమ్మ, వైద్య, అంగన్వాడీ, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పిల్లల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న డిఐఒ జగన్మోహనరావు

పది రోజులుగా విద్యుత్తు బంద్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని రేగులపాడులో విద్యుత్ స్తంభం నేలకొరిగి పది రోజులైనప్పటికీ విద్యుత్తు శాఖ అధికారులు ఎటువంటి చర్యలూ చేపట్టకపోవడంతో గ్రామస్తులు చీకట్లో మగ్గిపోతున్నారు. ఈనెల 6న బీభత్సమైన పెనిగాలులతో వర్షం కురిసిన నేపథ్యంలో విద్యుత్తు స్తంభం నేలకొరిగింది. వెంటనే సచివాలయ, విద్యుత్తు శాఖ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకుని విద్యుత్తును పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నేలకొరిగిన విద్యుత్తు సంభం

ఫ్యామిలీ డాక్టర్ వివరాలుండాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామ సచివాలయాల్లో ఫ్యామిలీ డాక్టరు వివరాలు ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథ రావు ఆదేశించారు. మండలంలోని తూడిలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టరు వైద్య సేవలను ఆయన తనిఖీ చేశారు. ఫ్యామిలీ డాక్టరు సేవలు అందిస్తున్న వైద్యుల వివరాలు ఆయా పరిధిలో గల ప్రజలందరికీ ఫోన్ నంబరుతో సహా తెలియాలని స్పష్టం చేశారు. ఫ్యామిలీ డాక్టరు విధానంలో అందిస్తున్న 14 రకాల పరీక్షలు - హెమోగ్లోబిన్, గర్భనిర్ధారణకు యూరిన్ పరీక్షలు, మల్టీ పారా స్ట్రిప్, గ్లూకో మీటర్ , మలేరియా, హెచ్.ఐ.వి, డెంగ్యూ, అసిటిక్ ఏసిడ్, టెస్ట్ ఫర్ అయోడిన్ ఇన్ సాల్ట్, క్లోరినేశన్, హెపటైటిస్ బి, ఫైలేరియా, సిఫిలిస్, కఫ పరీక్షల వివరాల బోర్డు, ఫ్యామిలీ డాక్టరు బోర్డు విధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 67 మందులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఫ్యామిలీ డాక్టరు సేవలకు వస్తున్న కేసుల వివరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. వచ్చిన కేసుల్లో గర్భిణీలు, బాలింతలు, రక్త హీనత తదితర కేసుల వివరాలు అడిగారు. కదలలేని స్థితిలో ఉన్న బాధితులకు ఇంటి వద్దకే వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. రక్త హీనత కేసులపై దృష్టి సారించాలని, హీమోగ్లోబిన్ పరీక్షలు ఎక్కువగా చేయాలని సూచించారు.



సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ

వడ దెబ్బ అప్రమత్తం

ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఒ ప్రజలకు సూచించారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ముఖ్యంగా ఉపాధి హామీ వేతనదారులపై దృష్టి సారించాలని ఆయన అన్నారు.

14న ఆరోగ్య మేళా

ప్రతి నెలా 14న ఆరోగ్య మేళా నిర్వహించాలన్నారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అంటు వ్యాధులు, అంటు వ్యాధులుకాని వ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా 104 వాహనాన్ని పరిశీలించి, అందులో లభ్యంగా ఉన్న పరికరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టరు మానస, మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పి) రెడ్డి భార్గవి, లాబ్ టెక్నీషియన్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.